క్లుప్తంగా

ఆంగ్ల అధ్యాపకుడికి డాక్టరేట్



భట్టిప్రోలు: భట్టిప్రోలు కేవీ స్కే కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థలో ఆంగ్ల అధ్యాపకుడిగా పని చేస్తున్న బిట్రా భానుశంకర్ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. చేనేత కుటుంబానికి చెందిన భానుశంకర్‌ది చెరుకుపల్లి మండలం రాజవోలు గ్రామం. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఎడ్యుకేషన్ విభాగం నుంచి 'ఐసీటీ అవేర్‌నెస్ అండ్ యాటిట్యూడ్ టూవార్డ్స్ ఐసీటీ ఎమాంగ్ అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్' అనే అంశంపై ప్రొఫెసర్ ఎం.రవి కుమార్ (ఆర్‌వీఆర్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపాల్) ఆధ్వర్యంలో పరిశోధన జరిపారు. కేఎస్‌కే విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కత్తెర సురేష్ కుమార్, సీఈవో డాక్టర్ కె.డేవిడ్ యశ్వంత్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది భానుశంకర్‌ను అభినందించారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేత



రేపల్లె రూరల్: ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేటేరు గ్రామ సర్పంచ్ కనపర్తి వసుమతి అన్నారు. మండలంలోని పేటేరు జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు శనివారం స్టూడెంట్ కిట్స్‌ను అందజేసి అనంతరం మాట్లాడారు. విద్యార్థులకు అవసరమయ్యే వస్తువులను ప్రభుత్వం అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాబూజీ, విద్యా కమిటీ చైర్మన్ మాచర్ల హేమసుందర రావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైలుపేటలో పేదలకు అన్నదానం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మనుగడ పంచకర్మ ఆయుర్వేద వైద్యశాల నిర్వాహకులు జంగం రవిబాబు, మానస కుమార్ ఆధ్వర్యంలో స్థానిక టీఎంరావు హైస్కూల్ 1984–85 ఏడాది పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సౌజన్యంతో స్థానిక రైలుపేటలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి నెల 9వ తేదీన దాతలు, పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నట్లు రవిబాబు తెలిపారు. 3,350 మందికి ప్రతి నెల అన్నదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, టీడీపీ నాయకులు, పూర్వ విద్యార్థులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య



బాపట్ల టౌన్: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని భర్తిపూడి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే భర్తిపూడి గ్రామానికి చెందిన రాలి పేరయ్య వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పుల బాధ తాళలేక శుక్రవారం సాయంత్రం పొలంలో పురుగుమందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు రూరల్ సీఐ శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రహదారిపై చెట్లు తొలగింపు

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామ పంచాయతీ పరిధిలోని రహదారి విస్తరణ పనులను పంచాయతీ సిబ్బంది శనివారం చేపట్టారు. గ్రామ కార్యదర్శి శేషగిరిరావు మాట్లాడుతూ చందోలు ఆర్యవైశ్య ధర్మసత్రం పక్కనే గల రహదారిని ఆనుకుని చెట్లు ఉండడం వల్ల రహదారి వెంట నడిచే వారికి తీవ్రంగా ఇబ్బంది కలిగిస్తుందని స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో వాటిని తొలగించేందుకు గ్రామ పంచాయతీ సిబ్బందితో రావడంతో స్థానికంగా ఉన్న కొందరు చెట్టు తొలగించేందుకు ఇబ్బంది కలిగించారని చందోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చందోలు పోలీసుల సాయంతో పాటు కొందరు ప్రజా ప్రతినిధులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని చెట్టును తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో సదరు వ్యక్తులు మా చెట్టును మేమే తొలగిస్తామని మీరు తొలగించేందుకు మేము అంగీకరించమంటూ వారే కొంత మేరకు తొలగించారు.

బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయులు

వాడవాడలా జగ్జీవన్‌రామ్ వర్ధంతి



రేపల్లెలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి,నాయకులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

బాపట్ల: యువతకు బాబు జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయులని మాజీ కౌన్సిలర్ వేమవరపు విజయకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 10వ వార్డు ప్యాడిషన్‌పేటలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బక్క రోశయ్య, పులి రవిబాబు, గడ్డం ఇస్సాక్, గుడిపాటి డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు అజరామరం

రేపల్లె రూరల్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన నేత బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలో ఆయన విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్ర సమరంలో జగ్జీవన్‌రామ్ తన వంతు పాత్ర వహించారని చెప్పారు. భారత ఉప ప్రధానిగా, దేశ తొలి కార్మిక శాఖ మంత్రిగా అనేక పదవులు అలంకరించారని, గొప్ప పరిపాలనా దక్షుడిగా పేరుగాంచారన్నారు. జగ్జీవన్‌రామ్‌ను యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో తమ పాత్ర పోషించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైఎస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, జూలకంటి బుజ్జిబాబు, అద్దేపల్లి వెంకటస్వామి, అల్లంశెట్టి శ్రీనివాసరావు, పెదపల్లి జాన్‌హానోక్, అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకులు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనగాని సత్యప్రసాద్, ఆలూరి దానియేలు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

వేమూరు: స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలు ప్రతి గ్రామంలో నిర్వహించాల్సిన బాధ్యత దళిత నాయకులపై ఉందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. గుంటూరు పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హరిత విప్లవంతో వ్యవసాయాన్ని ఆధునీకరించడంతో బాబూ జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు అనితర సాధ్యమన్నారు. సామాజిక సమానత్వంపై అందరినీ చైతన్య పరిచేందుకు మహాసభలకు పునాది వేశారన్నారు. ఎన్నో ఉద్యమాలు నడిపించారని కొనియాడారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టి, కత్తెర సురేష్, గోళ్ల అరుణ్, తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశానికి అమూల్య రత్నం జగ్జీవన్‌రామ్

పల్లెకోన(భట్టిప్రోలు): భారత ప్రజలకు లభించిన అమూల్య రత్నం బాబు జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం పల్లెకోనలో శనివారం గ్రేస్ ఫౌండేషన్ చైర్మన్ కైతేపల్లి షాలేమ్‌రాజు ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బాబు జగ్జీవన్‌రామ్ నాయకత్వం, వ్యక్తిత్వం, సేవానిరతి భారత దేశ ప్రజాస్వామిక వ్యవస్థకు మహా బలాన్ని చేకూర్చి పెట్టాయని అన్నారు. కార్యక్రమంలో చిలుమూరు రఘు, కొమ్ము జోష్ కుమార్, పులివర్తి రాజకిషోర్, రావూరి నవీన్, నన్నెపాముల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలు మండలం పల్లెకోనలో జగ్జీవన్‌రామ్‌కు నివాళి



వేమూరులో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



రేపల్లెలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

కొల్లూరు : ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్ర గాయాల బారిన పడగా, మరో వాహనంపై యువకుడు స్వల్ప గాయాలకు గురైన సంఘటన కొల్లూరు శివారు గాంధీనగర్ వద్ద శనివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని పెసర్లంకకు చెందిన కమ్మెల సాయి ద్విచక్ర వాహనంపై కొల్లూరు నుంచి తెనాలి వైపు వెళుతున్నాడు. అదే సమయంలో భట్టిప్రోలుకు చెందిన మరో యువకుడు కొల్లూరు వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో పెసర్లంకకు చెందిన సాయి తీవ్రగాయాల పాలయ్యాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి 108 వాహనం ద్వారా తెనాలి వైద్యశాలకు తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.



క్షతగాత్రుడికి సపర్యలు చేస్తున్న స్థానికులు

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

భట్టిప్రోలు: ఏపీ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో భట్టిప్రోలు ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని రైలుపేటలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ పి.నాగసుధ (క్రాప) వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ఎస్సీ, ఎస్టీ ఆవాసిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాల్సిందిగా ఆయుష్ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 225 మందిని పరీక్షించి సీజనల్, జనరల్ వ్యాధులకు సంబంధించి మందులు అందజేశారు. కాంపౌండర్ జి.విజితేంద్ర (జంపని), ఎంఎన్‌వో జి.ప్రసాదరావు, ఆశా కార్యకర్త ఎస్‌వీ రమణలు పాల్గొని వైద్య సేవలు అందించారు.



రైలుపేటలో ఆయుర్వేద వైద్య శిబిరం

పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు

భట్టిప్రోలు: పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని భట్టిప్రోలు, గుత్తావారిపాలెం పశు వైద్యులు బి.లక్ష్మీ రంజిత, రోషన్ బేగ్‌లు తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం భట్టిప్రోలు మండలంలోని పశు వైద్యశాలల్లో పెంపుడు జంతువులకు రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పెంపుడు జంతువులు కరవడం వల్ల మనుషులకు సోకే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. జంతు ప్రేమికులకు జూనోసిస్ డే ప్రాధాన్యతని వివరించారు. వ్యాక్సినేషన్‌లో పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



గుత్తావారిపాలెంలో కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

ఫిరంగిపురం: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని నుదురుపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఎస్.హనుమంతురావు(38), టి.ఆంజనేయులు ద్విచక్ర వాహనంపై పొలం వెళ్లి.. తిరిగి ఇంటికి వస్తున్నారు.

గ్రామ శివారులోకి రాగానే రైల్వేస్టేషన్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న హనుమంతురావుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆంజనేయులుకూ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతనిని వాహనంలో చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న సీఐ వీరబాబు ఆదేశాల మేరకు.. ఎస్ఐ వీరనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం శనివారం గుంటూరు తరలించారు. మృతుడి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి

పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెల 8న మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని చందోలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాలలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

కర్లపాలెం: ప్రజలు తమ పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కర్లపాలెం పశు వైద్యురాలు డాక్టర్ ఎం.రేచల్ దివ్య తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం కర్లపాలెం పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిట్ల వసంతరెడ్డి, వైద్య సిబ్బంది ఎం.మహేష్, బి.రాజేష్, జి.మోహనకృష్ణారెడ్డి, రహ్మతున్నీసా, అబ్దుల్, బాల శంకర్‌రెడ్డి, శ్రీనివాసాచార్యులు తదితరులు ఉన్నారు.

డిప్యూటీ తహసీల్దారుగా కనకదుర్గ బాధ్యతల స్వీకారం

వేమూరు: డిప్యూటీ తహసీల్దారుగా కనకదుర్గ శనివారం బాధ్యతలు చేపట్టారు. రేపల్లె మండలం కేంద్రంలో సార్వత్రిక ఎన్నికల డిప్యూటీ తహసీల్దారుగా ఆమె పని చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో చుండూరు మండలంలో ఆర్‌ఐగా పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గను కార్యాలయ సిబ్బంది అభినందించారు.

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

గుంటూరు మెడికల్: అమ్మ కోసం చెట్టు కార్యక్రమం బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని 4వ మండలం అరండల్ పేట వావిలాల సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటారు. తొలుత శ్యామప్రసాద్ ముఖర్జీ, వావిలాల గోపాలకృష్ణయ్య చిత్రపటంకు పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశ ఐక్యతకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దింటి కృష్ణ చైతన్య, ఈదర శ్రీనివాసరెడ్డి, సుకన్య, వెలగలేటి గంగాధర్, మంత్రి సుగుణ, పద్మనాభం, వావిలాల సత్యం, యనమండర శ్రీనివాస్, ఈమని మాధవరెడ్డి, బజరంగ్ రామకృష్ణ, వక్కలగడ్డ తిరుమలరావు, పద్మనాభుని రమాదేవి, జితేంద్ర గుప్తా, కృష్ణమూర్తి, చింతపల్లి వెంకట్, చంద్రశేఖర్, గోకుల్, మండలపు సురేష్, చిన్ని, ఆవుల వెంకటేశ్వరరావు, సాంబశివరావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం వద్ద విద్యుత్ లైటు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద విద్యుత్ లైటు తొలగించడంతో 'వైఎస్సార్ విగ్రహం వద్ద అంధకారం' అనే శీర్షికన ఈ నెల ఒకటో తేదీన సాక్షిలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. సమస్యను ఎంపీటీసీ సభ్యురాలు దారావత్ కుమారిభాయ్ పంచాయతీ పాలక వర్గం దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే లైటు ఏర్పాటు చేస్తామని పంచాయతీ కార్యదర్శి ఎ.రామ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం విగ్రహం వద్ద విద్యుత్ స్తంభానికి లైటు ఏర్పాటు చేశారు. లైటు ఏర్పాటు చేయడంతో వైఎస్సార్ సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మాదిగ జనజాతర మహాసభను జయప్రదం చేద్దాం

వేమూరు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో జరగనున్న మాదిగ జన జాతర సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు యల్లమాటి దాసు పిలుపునిచ్చారు. వేమూరు నియోజకవర్గం కూచిపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబుకు శనివారం కరపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యల్లమాటి దాసు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అవిర్భవించిన ఈదుమూడి మాదిగ జాతి ప్రజలకు పవిత్ర భూమిగా ఆయన అభివర్ణించారు. జన్మభూమి రుణం తీర్చు కోవటానికి మాదిగ జాతి ప్రజలంతా జన జాతర మహా సభలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ దండోర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కూచిపూడిలో అశోక్‌బాబుకు కరపత్రం అందజేస్తున్న యల్లమాటి దాసు

స్త్రీనిధి రుణాల లక్ష్యం రూ.6 కోట్లు

ఏపీఎం శ్రీమన్నారాయణ

భట్టిప్రోలు: స్వయం సహాయక సంఘాల బలోపేతానికి సిబ్బంది కృషి చేయాలని మండల సమాఖ్య ఏపీఎం జి.శ్రీమన్నారాయణ అన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శనివారం మండల సమాఖ్య కార్య నిర్వహణ సమావేశం సమాఖ్య అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న ప్రతి యానిమేటర్ క్రమం తప్పకుండా చిన్న సంఘాలు, గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహించి పుస్తక నిర్వహణ, ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూడాలని అన్నారు. స్త్రీ నిధి మేనేజర్ పి.అశోక్ మాట్లాడుతూ భట్టిప్రోలు మండలానికి ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.6 కోట్లు స్త్రీ నిధి జీవనోపాధి రుణాల నిమిత్తం లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందన్నారు. జీవనోపాధి కొరకు అర్హులైన మహిళలకు స్త్రీ నిధి రుణాలు ఇప్పించాలని సూచించారు. ఏపీ సీఎస్‌ఎఫ్-ఎస్ఎఫ్ఏ శ్రీవల్లి, సీఏ పాండురంగారావులు మహిళలకు డెమో పద్ధతిలో విత్తన శుద్ధి, బీజామృతం గూర్చి తెలియ చేశారు. సమావేశంలో ఎన్ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సుధీర్, హౌసింగ్ ఏఈ ఆర్.సౌమ్య, బ్యాంక్‌ల సమన్వయకర్త సౌజన్య, సమాఖ్య నిర్వాహకులు శ్రీదేవి, జ్యోతి, సీసీలు హనోకు, రజనీకుమారి, అకౌంటెంట్ బి.శిరీష, ఈసీ సభ్యులు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం శ్రీమన్నారాయణ

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

పిట్టలవానిపాలెం: రాయితీ వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు సూచించారు.పిట్టలవానిపాలెం రైతు సేవాకేంద్రం పరిధిలోని అలకాపురం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేజీ ఒక్కింటికి రూ.5ల రాయితీపై అందిస్తున్న బీపీటీ 5204, ఎంటీయూ 1224, ఎంటీయూ 1061 రకం వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గానూ పంట సాగుదారుల హక్కు పత్రాలు రెవెన్యూ శాఖ వారు అందిస్తున్నారని వాటిని కౌలు రైతులు పొందాలని తెలిపారు. ఈ–క్రాపు నమోదులోనూ, ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ, ధాన్యం అమ్మకాల సమయంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు, ఏఈఓ శేషమ్మ, వీఏఏ దీప్తి, రైతులు భేతాళం అచ్యుత రామరాజు, పెనుమెత్స మూర్తిరాజు, గాదెరాజు మురళి, వేగిరాజు శివ, దండు రామకృష్ణంరాజు తదితరులు ఉన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ

ఆక్రమణకు గురైన రహదారికి హద్దులు ఏర్పాటు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెసర్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి పెదలంక ఇందిరా నగర్ శివారు వరకు ఉన్న జెడ్పీ రహదారి ఆక్రమణకు గురి కావడంతో విద్యార్థులు, ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్స్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ నన్నెపాముల చంద్రశేఖర్‌బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు నన్నెపాముల నాగేశ్వరరావులు గ్రామానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఈ విషయమై తహసీల్దార్ ఐ.మునిలక్ష్మిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం సర్వేయర్ డి. శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పుష్పలత, వీఆర్వో మంద్రు జక్రయ్య, కమ్యూనిటీ సర్వేయర్ డి.బాబూరావు, సచివాలయ సర్వేయర్‌లు జెడ్పీ రహదారికి సర్వే నిర్వహించి హద్దులు తేల్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేములపల్లి శ్రీరంజని, వీరాంజనేయులు పాల్గొన్నారు.



పెదలంక ఇందిరానగర్ జెడ్పీ రహదారికి సర్వే చేపడుతున్న అధికారులు

రైల్వే గేట్లపై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

తెనాలిరూరల్: తెనాలిలోని పినపాడు గేటు మీదుగా ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ది తెనాలి పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘ సభ్యులు కోరారు. స్థానిక మారిస్‌పేటలోని పినపాడు, రేపల్లె రైల్వే గేట్లను సంఘ సభ్యులు శనివారం పరిశీలించారు. విజయవాడ–చెన్నై రైలు మార్గంలోని పినపాడు గేటు వద్ద రైళ్ల రద్దీని పరిశీలించిన అనంతరం సంఘ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నాలుగు నిమిషాలకు రైలు వెళుతుండడంతో గేటు వేసి ఉంచాల్సిన పరిస్థితి ఉందని, దీని వల్ల ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రెండు గేట్ల మీదుగా ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుత పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గతంలో ఎమెల్యేగా ఉన్న సమయంలో ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పూనుకున్నారని, కొన్ని కారణాల చేత ఆగిపోయిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరముందన్నారు. ఆయన వెంట రావూరి శివశంకరరావు, అబ్దుల్ ఆరీఫ్, వాకా పేరిరెడ్డి, అబ్రహాం లింకన్, రాజేష్, కె.బాబు ప్రసాద్, పూలా సతీష్, రమేష్ తదితర సభ్యులు ఉన్నారు.

